క్లుప్తంగా

విద్యార్థులకు షూ పంపిణీ



షూస్ అందిస్తున్న ఉపాధ్యాయులు

టేకుమట్ల: మండలంలోని గర్మిళ్లపల్లి శివారు బోయినిపల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ప్రధానోపాధ్యాయుడు సంగి ప్రవీణ్ సొంత ఖర్చులతో షూస్ అందజేశారు. కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు ప్రసాద్ చేతుల మీదుగా గురువారం విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని రకాల సౌకర్యాలను ప్రభుత్వం కల్పించిందన్నారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా విద్యార్థులను తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. ఉపాధ్యాయుడు రాజు, అంగన్‌వాడీ టీచర్ పోషిని లావణ్య ఉన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాల పంపిణీ



మంజూరు పత్రాలు అందజేస్తున్న రమాదేవి

చిట్యాల: మండలంలోని గోపాలపురంలో పంచాయతీ కార్యదర్శి రమాదేవి ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు గురువారం మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇళ్ల నిర్మాణ పనులను వెంటనే చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మూల శంకర్ గౌడ్, జిల్లా సేవదల్ అధ్యక్షుడు ఏకు రవీందర్, గ్రామ కమిటీ అధ్యక్షుడు నీలం కుమారస్వామి, నాయకులు పాల్గొన్నారు.

చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న రాజయ్య

మల్హర్: మండలంలోని రుద్రారం గ్రామానికి చెందిన సంగెం రాజమల్లు ఇటీవల అనారోగ్యంతో ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందాడు. ఆర్థిక సాయం కోసం సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేస్తున్నాడు. ఈ మేరకు రూ.32500 విలువ గల చెక్కు మంజూరైంది. కాగా, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బడితెల రాజయ్య బాధిత కుటుంబ సభ్యులకు గురువారం అందజేశారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ సంగెం రమేష్, నాయకులు సత్యనారాయణ పాల్గొన్నారు.

పరామర్శ



రేగొండ: పరామర్శిస్తున్న నాయకులు

టేకుమట్ల/రేగొండ: మల్హర్ మండలంలోని వల్లెకుంటకు చెందిన స్టేట్ ట్రేడ్ కార్పొరేషన్ చైర్మన్, డీసీసీ అధ్యక్షుడు ఐత ప్రకాశ్‌రెడ్డి మాతృమూర్తి లక్ష్మీబాయి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో బాధిత కుటుంబాన్ని కాంగ్రెస్ నాయకులు గురువారం పరామర్శించారు. భూపాలపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ కిష్టయ్య, పీఏసీఎస్ చైర్మన్ నడిపల్లి వెంటేశ్వరరావు, నాయకులు సంపత్‌రావు, ఉమేష్ గౌడ్, రవీందర్ రావు, భిక్షపతి, టేకుమట్ల మాజీ జెడ్పీటీసీ పులి తిరుపతిరెడ్డి నాయకులు రామారావు, చింతలపెల్లి స్వామిరావు, కృష్ణారెడ్డి, రత్నాకర్‌రెడ్డి, రాజమౌళి, వెంకటరాజిరెడ్డి, గట్టయ్య, మహిపాల్‌రెడ్డి ఉన్నారు.

అలంకారప్రాయంగా సెగ్రిగేషన్ షెడ్లు



సోమనపల్లిలో నిరుపయోగంగా ఉన్న సెగ్రిగేషన్ షెడ్డు



వెలిశాలలో రోడ్డు వెంట వేసిన చెత్త

- ప్రజాధనం దుర్వినియోగం
- పట్టించుకోని అధికారులు

టేకుమట్ల: చెత్తను సేకరించి, సంపదను సృష్టించుకునేందుకు గ్రామ పంచాయతీల పరిధిలో గత ప్రభుత్వం మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో సెగ్రిగేషన్ షెడ్లను నిర్మించింది. ఒక్కో షెడ్డుకు రూ.2లక్షల 50వేల నిధులను వెచ్చించి నిర్మించగా నాటి నుంచి నేటి వరకు అలంకారప్రాయంగా దర్శనమిస్తున్నాయి. మండలంలో 24 గ్రామ పంచాయతీలకు గానూ అన్ని గ్రామాల్లో సెగ్రిగేషన్ షెడ్లు నిర్మించగా చలివాగు పరివాహక ప్రాంతంలోని సుబ్బక్కపల్లి, ఎంపేడు సెగ్రిగేషన్ షెడ్లు భారీ వరదలకు పూర్తిగా ధ్వంసమయ్యాయి. మరి కొన్ని గ్రామాల్లో శిథిలావస్థకు చేరుకున్నాయి.

బహిరంగ ప్రదేశాల్లో చెత్త డంపింగ్

సెగ్రిగేషన్ షెడ్డుల పరిసరాలలోనే డంపింగ్ యార్డులను ఏర్పాటు చేసి, వాటి నుంచి తడి, పొడి చెత్తను వేరు చేసి సంపదను సృష్టించాలి. సెగ్రిగేషన్ షెడ్డులను వినియోగంలోకి తేకపోవడమే కాకుండా ఇష్టారీతిన బహిరంగ ప్రదేశాల్లో చెత్తను తరలిస్తూ నిప్పు పెట్టి కాల్చేస్తున్నారు. రబ్బర్, ప్లాస్టిక్ వ్యర్థాలను కాల్చడం వల్ల వచ్చే విష వ్యర్థ వాయువులు గాలిలో కలిసి పర్యావరణాన్ని కలుషితం చేస్తున్నాయి. దీంతో వాతావరణం కలుషితమై శ్వాసకోశ వ్యాధులు ప్రబలే ప్రమాదముందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సెగ్రిగేషన్ షెడ్డులను నిర్మించి ఇప్పటి వరకు దాదాపు ఐదు సంవత్సరాలు గడుస్తున్నా వాటి నుంచి ఇప్పటి వరకు గ్రామ పంచాయతీలకు ఒక్క రూపాయి కూడా జమ కాకపోవడంతో పాటు, అలంకారప్రాయంగా మారాయి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి డంపింగ్ యార్డులను, సెగ్రిగేషన్ షెడ్డులను వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

వినియోగంలోకి తీసుకురావాలి



పర్యావరణ కాలుష్యం నుంచి రక్షణ పొందేందుకు డంపింగ్ యార్డులు, సెగ్రిగేషన్ షెడ్డులను వినియోగంలోకి తీసుకురావాలి. గ్రామాల్లో సేకరించిన చెత్తను బహిరంగ ప్రదేశాల్లో కాకుండా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ప్రదేశాల్లోనే డంపు చేయాలి. అంతే కాకుండా చెత్త నుంచి సంపదను సృష్టించే విధంగా సిబ్బందికి శిక్షణ ఇస్తే గ్రామ పంచాయతీకి మరింత అదనపు ఆదాయం సమకూరుతుంది. అలాగే చెత్తను కాల్చేయడం నిలిపి వేయాలి.

– గువ్వాడి లక్ష్మణ్, ఆరెపల్లి

ఎరువు తయారు చేస్తున్నాం..



మండలంలోని అన్ని గ్రామాల్లోని సెగ్రిగేషన్ షెడ్డుల్లో సేంద్రియ ఎరువులను తయారు చేస్తున్నాం. షెడ్డులు నిర్మించిన తర్వాత తయారు చేసిన సేంద్రియ ఎరువును ఢిల్లీకి సైతం పంపించాం. భవిష్యత్‌లో పూర్తి స్థాయిలో సేంద్రియ ఎరువును తయారు చేస్తాం. వరదలకు ధ్వంసమైన సెగ్రిగేషన్ షెడ్లుకు మరమ్మతులు చేపిస్తాం.

– గౌడ సురేష్, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ టేకుమట్ల

జెండా తెస్తుండగా విద్యుత్ షాక్

- ముగ్గురు విద్యార్థులు, అటెండర్‌కు గాయాలు





గాయాలపాలైన విద్యార్థులు

కాళేశ్వరం: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా పాఠశాలలో ఇనుప జెండాను అటెండర్‌తో పాటు విద్యార్థులు తీసుకువస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలకు తగిలి ముగ్గురు విద్యార్థులు, అటెండర్‌కు గాయాలైన ఘటన మహదేవపూర్ మండలకేంద్రంలో గురువారం చోటుచేసుకుంది. జెండాకు రంగులు వేసి ముస్తాబు చేసేందుకు మహదేవపూర్ మండలకేంద్రంలోని బాలుర పాఠశాల అటెండర్ దుంపల నవీన్‌తో 8వ తరగతి విద్యార్థులు బర్రెపిట్టల శివకుమార్, సుంకరి నవనీత్, 6వ తరగతి విద్యార్థి దయ్యాల నవీన్ వెళ్లారు. మెట్లమార్గం గుండా ఇనుప జెండాను అటెండర్ పట్టుకోగా బరువు ఉండడంతో విద్యార్థులు సాయం చేశారు. పైన విద్యుత్ తీగలు గమనించకపోవడంతో తగిలి విద్యుత్ సరఫరా అయింది. దీంతో అంటెండర్ ఒక్కసారిగా జెండాను చేతుల్లోంచి వదిలేశాడు. అతనితో పాటు ముగ్గురు విద్యార్థులకు షాక్ రావడంతో మెట్లపై నుంచి కిందకి పడిపోయారు. వారిని వెంటనే పాఠశాల ఉపాధ్యాయులు మహదేవపూర్ ఆస్పత్రికి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం భూపాలపల్లి వంద పడకల ఆస్పత్రికి తరలించారు. కాళ్లు, చేతులు, తలకు స్వల్పగాయాలు కావడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. తల్లిదండ్రులు, బంధువులతో ఆస్పత్రికి ప్రాంగణం కిక్కిరిసింది.

ఉన్నత స్థానాలకు చేరుకోవాలి

- ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్



దుస్తులు అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

రేగొండ: విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని, వారికి చేయూత అందించేందుకు దాతలు ఎప్పుడు ముందుంటారని ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్ అన్నారు. గురువారం కొత్తపల్లిగోరి మండలంలోని జగ్గయ్యపేట గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 60 మంది విద్యార్థులకు క్రీడా దుస్తులు, షూస్, ఐడీ కార్డులు, బెల్టులు పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థులు పంపిణీ చేశారు. పూర్వ విద్యార్థులు అశోక్‌రెడ్డి, రాజయ్య, తనుగుల రమేష్, ఉపాధ్యాయులు గిరిధర కృష్ణ, రాజేందర్, చక్రధర్, కుమారస్వామి, శ్రీధర్, కోటిలింగం, శిరీష, మహేందర్, కల్పనా కుమారి, శ్రీనివాస్, బాధవి, ప్రతాప్, విద్యార్థులు పాల్గొన్నారు.

సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



రేగొండ: పత్తి పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు



మొగుళ్లపల్లి: మొక్కజొన్న పంటను..

- శాస్త్రవేత్త డాక్టర్ వీరన్న

రేగొండ/మొగుళ్లపల్లి: పత్తి పంటలో సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టాలని వరంగల్ ప్రాంతీయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ వీరన్న సూచించారు. రేగొండ, మొగుళ్లపల్లి మండలాల్లో వరంగల్ ప్రాంతీయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తల బృందం గురువారం పర్యటించింది. ఈ సందర్భంగా వారు పత్తి, వరి, మొక్కజొన్న పంటలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అధిక వర్షాలకు పత్తి పంటపై 10 గ్రాముల పొటాషియం నైట్రేట్ లేదా 19.19.19 10 గ్రాముల నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. అదే విధంగా పంట ఎదుగుదలకు వర్షాలు తగ్గిన వెంటనే 25 కిలోల యూరియా, 10 కిలోల పొటాష్ ఎరువులను మొక్కకు ఐదు సెంటి మీటర్ల దూరంలో వేసుకోవాలని సూచించారు. అధిక తేమకు పత్తి మొక్కలకు వేరు కుళ్లుతెగ సోకడానికి అవకాశం ఎక్కువగా ఉంటుందని, దీని నివారణకు 3 గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్, ఒక గ్రాము కార్బండిజమ్ లీటర్ నీటికి కలిపి ఆ ద్రావణాన్ని తెగులు సోకిన మొక్కల పాదుల చుట్టూ వారం వ్యవధిలో రెండు సార్లు పోయాలని తెలిపారు. అలాగే వరి నారు ముదిరినట్లైతే రైతులు కొనలు తుంచి నాటు వేసుకోవాలని సూచించారు. దీని ద్వారా కాండం తొలుచు పురుగు గుడ్లను నిర్మూలించుకోవచ్చని తెలిపారు. అదేవిధంగా మొక్కజొన్నలో ముప్ప పురుగు ఉన్నచోట ఇమమెక్టిన్ బెంజోట్ 4 మిల్లీ లీటర్లు 10 లీటరు నీటిలో కలిపి స్ప్రే చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ ప్రశాంత్, డాక్టర్ రమ్య, మండల వ్యవసాయాధికారులు పెద్ది వాసుదేవరెడ్డి, సురేందర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

మహాసభలు విజయవంతం చేయాలి



భూపాలపల్లి అర్బన్: వాల్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు



మొగుళ్లపల్లిలో..

- సీపీఐ పట్టణ కార్యదర్శి సోక్కు ప్రవీణ్

భూపాలపల్లి అర్బన్: మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్ మండలంలో ఈనెల 19 నుంచి నిర్వహించే సీపీఐ రాష్ట్ర నాలుగో మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ పట్టణ కార్యదర్శి సోక్కు ప్రవీణ్ పిలుపునిచ్చారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో గురువారం వాల్ పోస్టర్ ఆవిష్కరణ చేపట్టారు. ఈ సందర్భంగా ప్రవీణ్ మాట్లాడుతూ.. ఈ మహాసభలకు జాతీయ నాయకులు హాజరవుతారని తెలిపారు. సీపీఐ నాయకులు జాఫర్, జోసెఫ్, శ్రీకాంత్, యాకూబ్ పాషా, తిరుపతి, లావణ్య, రమేష్, శ్రావణ్, దేవేందర్, రవీందర్ లు పాల్గొన్నారు.

మొగుళ్లపల్లి: భారత కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర నాలుగో మహాసభలను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి గులాంనబి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో మహాసభల పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీపీఐ నిరంతరం ప్రజా సమస్యలపై పోరాటం చేస్తుందన్నారు. సీపీఐ మండల కార్యదర్శి నిమ్మల రాజయ్య, సహాయ కార్యదర్శి సుదమల్ల స్వామి, అశోక్, రాజమౌళి, సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతల బలోపేతమే లక్ష్యం

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



గణపురం: పోలీస్ సర్కిల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గండ్ర, కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కిరణ్ ఖరే



భూపాలపల్లి అర్బన్: సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గండ్ర తదితరులు

గణపురం: రాష్ట్రంలో శాంతి భద్రతల పరిరక్షణే లక్ష్యంగా సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండలకేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కిరణ్ ఖరేతో కలిసి నూతన సర్కిల్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నూతనంగా ఏర్పడిన పోలీస్ సర్కిల్‌లో గణపురం, రేగొండ, కొత్తపల్లిగోరి మండలాలు ఉంటాయని తెలిపారు. గతంలో చిట్యాల మండలంలో ఉండడంతో దూర ప్రాంతాల నుంచి వెళ్లే వారికి ఇబ్బంది అవుతుందని గమనించి ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా మూడు మండలాలను కలిపి నూతన సర్కిల్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అలాగే కలెక్టర్, ఎస్పీ మాట్లాడుతూ.. ప్రజలకు అందుబాటులో రక్షణ చర్యలు ఉండాలనే ఆలోచలనో సర్కిల్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని మూడు మండలాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కాగా, నూతన సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా సీహెచ్ కరుణాకర్‌రావు బాధ్యతలు చేపట్టాడు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ నరేష్‌కుమార్, డీఎస్పీ సంపత్ పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు

భూపాలపల్లి అర్బన్: నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు ఎంతగానో దోహదం చేస్తాయని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లాకేంద్రంలోని వ్యాపార సముదాయాలు, చాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యులు, వివిధ వ్యాపార సంస్థలు, జెన్‌కో సహకారంతో ఏర్పాటు చేసిన 160 సీసీ కెమెరాలను ఎస్పీ కిరణ్‌ఖరేతో కలిసి ఎమ్మెల్యే సత్యనారాయణరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జెన్‌కో, జిల్లాకేంద్రంలోని వివిధ వ్యాపార వాణిజ్య, దాతల సహకారంతో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సింగరేణి జీఎం రాజేశ్వర్‌రావు, పట్టణ చాంబర్ ఆఫ్ కామర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రామ్‌చందర్ పాల్గొన్నారు.

బీజేపీని గద్దె దించే వరకూ పోరాటం..

భూపాలపల్లి రూరల్: మోదీ చేసిన ఓటు చోరీ రాజ్యాంగాన్ని ఖూనీ చేయడమేనని, బీజేపీని గద్దె దించే వరకూ కాంగ్రెస్ పోరాటం ఆగదని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. లోకసభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ దేశవ్యాప్తంగా ఓటు చోరీపై చేస్తున్న పోరాటానికి సంఘీభావంగా జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీపట్టణ అధ్యక్షులు ఇస్లావత్ దేవన్ అధ్యక్షతన పార్టీ కార్యాలయం నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మోదీ ఓటు చోరీ చేయడం ప్రజాస్వామ్యానికి, రాజ్యాంగానికి చేసిన ద్రోహం చేయడమే అన్నారు. ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోవడం ప్రతీ పౌరుడి కర్తవ్యం అని తెలిపారు.

మానవత్వం చాటుకున్న ఎమ్మెల్యే

భూపాలపల్లి మండలం మోరంచపల్లి జాతీయ రహదారి బ్రిడ్జిపై ప్రమాదవశాత్తు బైక్‌పై నుంచి జారిపడి మహిళకు గాయాలయ్యాయి. ఈ క్రమంలో గణపురం నుంచి భూపాలపల్లి వైపు వస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు మహిళను చూసి మానవత్వంతో కాన్వాయి నుంచి దిగి అంబులెన్స్ ద్వారా జిల్లా కేంద్రంలోని 100 పడకల ఆస్పత్రికి తరలించే ఏర్పాటు చేశారు. మహిళకు అత్యవసర వైద్యం అందించాలని డాక్టర్లకు ఫోన్ ద్వారా సూచించారు.

నేత్రదానం

చిట్యాల: మండలంలోని చల్లగరిగ గ్రామానికి చెందిన దూడపాక రాజమ్మ(52) అనారోగ్యంతో చికిత్స పొందుతూ బుధవారం వరంగల్ ఎంజీఎంలో మృతి చెందింది. కాగా మృతురాలి కుటుంబ సభ్యులు ఎంజీఎం ఆస్పత్రిలో రాజమ్మ నేత్రాలను దానం చేశారు.

'ఇసుక లారీలతోనే కూలిన బ్రిడ్జి'

ములుగు రూరల్ : ఇసుక లారీలను నియంత్రణ చేయక పోవటంతోనే మల్లంపల్లి గ్రామ సమీపంలోని బ్రిడ్జి కూలిపోయిందని బీఆర్ఎస్ ములుగు నియోజకవర్గ ఇన్‌చార్జ్ బడే నాగజ్యోతి అన్నారు. గురువారం పార్టీ శ్రేణులతో కలిసి మల్లంపల్లి వద్ద కూలిన బ్రిడ్జిని నాగజ్యోతి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో రోజురోజుకు వేలకొద్దీ లారీలు ఇసుకను తరలిస్తుండటంతో మంగపేట నుంచి మల్లంపల్లి వరకు రోడ్డు గుంతల మయంగా మారింది. ప్రమాదాలు జరుగుతున్న అధికారులు స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బ్రిడ్జి కూలడం వల్ల రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారని, కిలోమీటర్ల దూరం అదనంగా ప్రయాణించాల్సి వస్తుందని అన్నారు. కార్యక్రమంలో నాయకులు భిక్షపతి, చంద్రమౌళి, విజయరామ్ నాయక్, రామ్మూర్తి, రామసహాయం, శ్రీనివాసరెడ్డితో పాటు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం



రంగాపురంలో వైద్య శిబిరంలో పాల్గొన్న తహసీల్దార్ సునీత, వైద్య సిబ్బంది

- డాక్టర్ నాగరాణి



ముల్కలపల్లిలో వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ నాగరాణి

మొగుళ్లపల్లి: పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యంగా ఉంటామని వైద్యాధికారిణి నాగరాణి అన్నారు. మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ముల్కలపల్లి, రంగాపురం, ఇప్పలపల్లి గ్రామాల్లో గురువారం ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించారు. రంగాపురం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి తహసీల్దార్ సునీత హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ నాగరాణి మాట్లాడుతూ.. వర్షాలు కురుస్తుండడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. కాచి చల్లార్చిన నీటినే తాగాలని సూచించారు. వేడివేడి ఆహార పదార్థాలు తినాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. దోమలు కుట్టడం వల్ల మలేరియా, చికెన్ గున్యా, డెంగీ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. ముల్కలపల్లిలో 71 మందికి, రంగాపురంలో 66, ఇప్పలపల్లిలో 56, మందికి వైద్య పరీక్షలు చేసినట్లు తెలిపారు. డాక్టర్లు సరళ, వాణి, కమిటీ హెల్త్ ఆఫీసర్ రాజేంద్రప్రసాద్, హెల్త్ అసిస్టెంట్ భిక్షపతి, ఏఎన్ఎంలు శ్రీలత, భారతి, సువర్ణ, సబిదా, పంచాయతీ కార్యదర్శులు దివ్య, తేజస్విని ఆశకార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

పాఠశాలల్లో కృష్ణాష్టమి వేడుకలు



కాటారం: ఉట్టికొట్టే కార్యక్రమంలో చిన్నారులు



తాడిచర్ల ప్రాథమిక పాఠశాలలో..



కొయ్యూరు దేవి విద్యోదయ విద్యాలయంలో కృష్ణుడు, గోపిక వేషధారణలో విద్యార్థులు

మల్హర్: మండలంలో తాడిచర్ల ఎస్సీకాలనీ, రామరావుపల్లి ప్రాథమిక పాఠశాలల్లో, సాయివాణి విద్యానికేతన్, కొయ్యూరు దేవి విద్యోదయ విద్యాలయంలో గురువారం ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. విద్యార్థులు కృష్ణుడు, గోపికల వేషధారణలో అలరించారు. ఈ కార్యక్రమంలో తాడిచర్ల కాంప్లెక్స్ హెచ్ఎం తిరుపతిరెడ్డి, హెచ్ఎంలు పద్మ, అరుణ్‌కుమార్, ఉపాధ్యాయులు కవిత సురేష్, కవిత, ప్రైవేట్ పాఠశాలల కరస్పాండెంట్లు సంపత్‌రావు, రాజు తదితరులు పాల్గొన్నారు.

కాటారం: మండల కేంద్రంలోని విద్యానికేతన్ హై స్కూల్‌తో పాటు చింతకాని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ముందస్తు శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. చిన్నారులు గోపికలు, శ్రీకృష్ణుడి వేషధారణతో అలరించారు. చిన్నారులు, విద్యార్థులు కేరింతల మధ్య ఉట్టి కొట్టారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో విద్యానికేతన్ కరస్పాండెంట్ బుర్ర వెంకటేశ్‌గౌడ్, హెచ్ఎం బుర్ర సుజారాణి, చింతకాని హై స్కూల్ హెచ్ఎం శైలజ, ఉపాధ్యాయులు గండు రాజబాబు, రవీందర్, జయరాజు, రాజారాం, హారిక, రమేశ్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

యూరియా కోసం ఆందోళన చెందొద్దు

కాటారం: మండలంలోని సాగుకు సరిపడా యూరియా పంపిణీ చేయడం జరుగుతుందని రైతులు ఆందోళన చెందొద్దని ఏఓ పూర్ణిమ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వానాకాలం సీజన్ 2025–26కు సంబంధించి మండలంలో 14వేల ఎకరాల పత్తి, 12వేల ఎకరాలలో వరి సాగు చేసినట్లు పేర్కొన్నారు. మొదటి విడతలో రైతులు తమ పంటల్లో చల్లుకోవడానికి 1170 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉండగా పలు దఫాలుగా ప్రభుత్వ, ప్రైవేటు డీలర్ల ద్వారా 1034 మెట్రిక్ టన్నులు పంపిణీ చేసినట్లు తెలిపారు. మిగిలిన 136 మెట్రిక్ టన్నుల యూరియా కోసం ఈ వారం ఇండెంట్‌గా వ్యవసాయ శాఖ ద్వారా మార్క్‌ఫెడ్‌కి పంపించినట్లు తెలిపారు. యూరియా కొరత లేదని పూర్తి స్థాయిలో రైతులకు అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు. ఎరువుల దుకాణాల యజమానులు యూరియా కృత్రిమ కొరత సృష్టించి రైతులను అయోమయానికి గురి చేస్తే చర్యలు తప్పవని ఏఓ హెచ్చరించారు. అధిక ధరల విక్రయంపై వ్యవసాయశాఖ నిఘా ఉంటుందని తెలిపారు.